క్లుప్తంగా...

ప్రథమ వార్షికోత్సవ వేడుకలు

బోడుప్పల్: అంబేద్కర్‌నగర్ కాలనీలోని శ్రీఅభయ హస్త ఆంజనేయ స్వామి దేవాలయం ప్రథమ వార్షికోత్సవాన్ని శుక్రవారం వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు వెల్లడించారు. శుక్రవారం స్వామి వారికి సుప్రభాత సేవ, సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం, విష్ణు సమస్రనామ స్తోత్రపారాయణం నిర్వహించారు. శనివారం స్వామి వారికి ఆకుపూజ, సీతారామ చంద్రస్వామి శాంతి కల్యాణ మహోత్సవం నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

కంటి అద్దాల పంపిణీ



కళ్లద్దాలను పంపిణీ చేస్తున్న శేఖర్‌రెడ్డి

బోడుప్పల్: 9వ డివిజన్ పరిధిలోని బుడగ జంగాల కాలనీలో శుక్రవారం బీఆర్ఎస్ సీనియర్ నాయకులు మోదుగు శేఖర్‌రెడ్డి పర్యటించి స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రోడ్లు, డ్రైనేజీ సమస్య, కరెంట్ పోల్స్, లైట్లను పరిశీలించారు. అనంతరం శ్రీనివాస్ కాలనీలో కమ్యూనిటీ హాల్‌లో కంటి వెలుగు కేంద్రాన్ని పరిశీలించి, కంటి అద్దాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మహమ్మద్ అలీమ్, కాలనీ వాసులు పాల్గొన్నారు.

లక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయ హుండీ లెక్కింపు



మల్కాజిగిరి: ఆనంద్‌బాగ్‌లోని లక్ష్మీ వేంకటేశ్వర దేవస్థానం హుండీ లెక్కింపు శుక్రవారం దేవాదాయశాఖ పర్యవేక్షణాధికారి వెంకన్న సమక్షంలో జరిగింది. 59 రోజుల హుండీ లెక్కింపు ద్వారా సుమారు రూ.3,09,622 ఆదాయం వచ్చిందని ఆలయ ఈవో రవీందర్‌రెడ్డి తెలిపారు. హుండీ లెక్కింపులో అర్చకులు ముడుంబై వేంకటరమణాచార్యులు, తులసి రమణాచార్యులు, క్లర్క్ సుధాకర్, పాలకమండలి మాజీ ప్రతినిధులు ఉమేష్‌సింగ్, రాందాస్ సంతోష్, గణేష్, రత్నాకర్, రవీందర్, ఆలాపన, భక్తులు గిరి, ప్రసాద్, సూర్యకుమారి, రత్న, వీణ మాధురి, గౌరి, లలిత, సుశీల, పద్మ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు ప్రాధాన్యం



సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ సునీత

మౌలాలి: మౌలాలి డివిజన్ ఆండాల్‌నగర్‌లో రూ.28 లక్షలతో నిర్మించే సీసీ రోడ్డు పనులను శుక్రవారం కార్పొరేటర్ గున్నాల సునీతశేఖర్ యాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మౌలాలి డివిజన్ పరిధిలోని ప్రతి కాలనీలో అభివృద్ధి పనులకు ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. నూతన రోడ్డు పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు గున్నాల చంద్రశేఖర్‌యాదవ్, నాయకులు మల్లారెడ్డి, శ్రీనివాస్‌యాదవ్, వెంకటేష్, అనిల్, నటరాజు, నాగేంద్రచారి, కాలనీవాసులు ప్రకాష్, గోపీనాథ్, హన్మంతురావు, గంగాధర్‌రావు, పుష్పయాదవ్, సునంద తదితరులు పాల్గొన్నారు.

పాలిసెట్‌లో లాస్యప్రియ విజ్ఞాని జిల్లా ఫస్ట్



మేడిపల్లి: పీర్జాదిగూడ నగర పాలక సంస్థ పరిధిలోని మేడిపల్లి శ్రీరామ ఆర్టీసీ కాలనీలో నివాసముండే కేఎస్ఎస్ఆర్ లాస్య ప్రియ విజ్ఞాని పాలిసెట్ పరీక్షల్లో మేడ్చల్ జిల్లా ఫస్ట్ ర్యాంక్ సాధించినట్లు తల్లిదండ్రులు జానకికుమారి, కె.శ్రీరామ గోపాల్ వెల్లడించారు. శుక్రవారం ప్రకటించిన పాలిసెట్ ఫలితాల్లో బైపీసీలో జిల్లా ఫస్ట్ ర్యాంక్, ఎంపీసీలో జిల్లా సెకండ్ ర్యాంక్ సాధించినట్లు వెల్లడించారు. మొత్తం 120 మార్కులకు 115 మార్కులు సాధించినట్లు వివరించారు. పరీక్షల కోసం 15 రోజులుగా శ్రీశ్రీ ట్యూషన్ కోచింగ్ సెంటర్‌లో శిక్షణ తీసుకున్నట్లు తెలిపారు. మేడిపల్లి ఎస్ఏఫ్ఎస్ ఉన్నత పాఠశాలలో 10వతరగతి చదివిన లాస్య ప్రియ విజ్ఞాని 10/10 జీపీఏ సాధించినట్లు చెప్పారు.

ఆర్.ఆర్.ఆర్.. ఫుల్ రెస్పాన్స్..

పీర్జాదిగూడలో.. ఆ కేంద్రాలకు ఆదరణ

- సామాజిక బాధ్యతగా స్వీకరిస్తున్న ప్రజలు
- 26 వార్డుల్లో ఆర్ఆర్ఆర్ కేంద్రాల ఏర్పాటు
- ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి



ఆర్ఆర్ఆర్ కేంద్రం ద్వారా వస్తువులను సేకరిస్తున్న మేయర్ వెంకట్‌రెడ్డి

మేడిపల్లి: పీర్జాదిగూడ నగర పాలకసంస్థ పరిధిలో ఇటీవల ఏర్పాటు చేసిన రెడ్యూస్, రీయూజ్, రీసైకిల్ (ఆర్ఆర్ఆర్) వినూత్న కార్యక్రమానికి ప్రజల నుంచి ఆదరణ లభిస్తోంది. నిరుపయోగమైనవి ఇచ్చేద్దాం.. ఆర్ఆర్ఆర్‌ను ఆదరిద్దాం.. అనే నినాదంతో 26 డివిజన్లలో 26 కేంద్రాలను ఏర్పాటు చేయగా పౌరుల నుంచి స్పందన లభిస్తోంది. ఇళ్లలో నిరుపయోగమైన అన్ని రకాల వస్తువులను ఈ కేంద్రాల్లో అందజేస్తున్నారు. చెత్త కుప్పల్లోకి చేరే వ్యర్థాలను తగ్గించుకోవడం, మళ్లీ వాడుకునే వస్తువులకు ప్రాధాన్యం ఇవ్వడం, రీసైక్లింగ్ ద్వారా కాలుష్యాన్ని తగ్గించుకోవడం ఈ కేంద్రాల ముఖ్య ఉద్దేశ్యంగా చెప్పవచ్చు.

ఆర్ఆర్ఆర్ ముఖ్య ఉద్దేశ్యం..

- రెడ్యూస్ అంటే చెత్త కుప్పలో వేసే వ్యర్థాలను తగ్గించుకోవడం, మనం వినియోగిస్తున్న వాటిలో అవసరం ఉన్నంత వరకు వాడుకోవడం, తద్వార ఆర్థికంగా లాభం చేకూరడంతో పాటు భూమిని కాపాడటంలో తమవంతు సాయం అందించడం. చెత్త తగ్గాలంటే వాడి పారేసే వస్తువుల కంటే మళ్లీ మళ్లీ వాడుకునే వస్తువులకు ప్రతి ఒక్కరూ ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వడం.
- వాడిన వస్తువులను మళ్లీ పునర్ వినియోగించడాన్ని రియూజ్ అనవచ్చు. సమాజంలో కొంత మంది బట్టలు, వాహనాలు కొనుగోలు చేసి కొంత కాలం వాడుకున్న తర్వాత వాటిని పక్కన పడేస్తారు. ఇవి అవసరం ఉన్న వారు సమాజంలో చాలామంది ఉంటారు. ఈ కార్యక్రమం ద్వారా వారికి అందజేయడం. అలాగే పుస్తకాలను సంవత్సరం అయిన తరువాత అవి ఎవరికి అవసరం ఉంటాయో వారికి ఉచితంగా ఇచ్చేందుకు అవకాశం ఉంటుంది.
- రీసైక్లింగ్ చేయడం వల్ల సమాజంలో చాలా వరకు కాలుష్యం తగ్గుతుంది. ప్లాస్టిక్, కాగితం వ్యర్థాలను రీసైక్లింగ్ చేసి వాటిని మరో అవసరానికి వినియోగించవచ్చు. కొన్ని రకాల ప్లాస్టిక్ వ్యర్థాలు నశించి పోయేందుకు భూమిపై వందల సంవత్సరాలు పడుతుంది. వాటిని రీసైక్లింగ్ చేసి కాలుష్యాన్ని తగ్గించుకోవచ్చు. రీసైక్లింగ్ విభాగంలో ఈ వేస్ట్, స్మార్ట్‌ఫోన్స్, ల్యాప్‌టాప్స్, డెస్క్‌టాప్స్ ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులున్నాయి. ప్లాస్టిక్, ఎలక్ట్రానిక్ వస్తువులను రీసైక్లింగ్ చేయడం వల్ల గాలి, నేల, నీటి కాలుష్యాన్ని గణనీయంగా తగ్గించవచ్చు. దీంతో పర్యావరణాన్ని పూర్తిగా పరిరక్షించుకోవచ్చు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



స్వచ్ఛ భారత మిషన్ – అర్బన్ 2.0లో భాగంగా పీర్జాదిగూడలోని 26 వార్డుల్లో 26 ఆర్ఆర్ఆర్ కేంద్రాలను ఏర్పాటు చేశాం. పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అనే నినాదంతో అధికారులు, పాలకవర్గం ముందుకు వెళ్తున్నాం. ఇందుకు ప్రజల నుంచి స్పందన లభిస్తుంది. ప్రతి పౌరుడు ఆర్ఆర్ఆర్ కేంద్రాలను ఆదరించడంతోపాటు అందులో భాగస్వాములు కావాలని కోరుతున్నాం. ప్రజల భాగస్వామ్యంతో భవిష్యత్ తరాలకు మంచి పర్యావరణం అందించాలనే లక్ష్యంతో ఈ కేంద్రాలను ఏర్పాటు చేశాం. రీయూజ్ చేసే పరికరాల కొనుగోలు కోసం కార్పొరేషన్ పరిధిలో అవుట్‌లెట్‌ను ఏర్పాటు చేస్తాం. ఈ ఆర్ఆర్ఆర్ కేంద్రాల ద్వారా సేకరించిన వస్తువులను పరికరాలను అవసరం ఉన్నవారికి ఉచితంగా ఇస్తారు.

– జక్క వెంకట్‌రెడ్డి, మేయర్ పీర్జాదిగూడ

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి



ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఉప్పల్ హిల్స్ కాలనీవాసులు

హబ్సిగూడ: రాంరెడ్డినగర్ మల్లన్న దేవాలయం సమీపంలో నిర్మిస్తున్న 450 ఎంఎం డయా సీవరేజ్ పైపులైన్, 300 ఎంఎం డయా సబ్‌లైన్ పనులను శుక్రవారం ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి, కార్పొరేటర్ కక్కిరేని చేతనహరీష్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డి మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలే ధ్యేయంగా పనిచేస్తోందన్నారు. కార్యక్రమంలో జలమండలి జీఎం సంతోష్‌కుమార్, డీజీఎం రజనీకాంత్‌రెడ్డి, మేనేజర్ రవీందర్, బీఆర్ఎస్ నాయకులు గరిక సుధాకర్, రవీందర్‌రెడ్డి, శివ, శ్రీధర్, యాకంతారావు, వెంకటసాయి, కృష్ణ, యాదమ్మ, రాజ్యలక్ష్మీ, భాగ్యరేఖ, కాలనీ అధ్యక్షులు సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, కోశాధికారి నాగరాజు, లక్ష్మణ్, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

ఉప్పల్ డివిజన్ ఉప్పల్ హిల్స్ కాలనీలో తాగునీరు, డ్రైనేజీ, సీసీ రోడ్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కాలనీవాసులు శుక్రవారం హబ్సిగూడలో ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. స్పందించిన ఆయన సంబంధిత అధికారులకు సమస్యలను వివరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు వేముల సంతోష్‌రెడ్డి, నోముల మైసయ్య, కాలనీ అధ్యక్షులు బాజే అబ్బయ్య, సోమయ్య, కెమెంట్, శ్రీనివాస్, నర్సింహాగౌడ్, ఉపేందర్, హరికృష్ణచారి, అరుణ, నవత, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.



పైపులైన్ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డి, కార్పొరేటర్ చేతన

కొండపైన బస్తీ దవాఖానా

- వెంటనే మార్చకపోతే పెద్దఎత్తున ఆందోళన
- కాంగ్రెస్ సీనియర్ నాయకుడు రాగిడి లక్ష్మారెడ్డి

ఉప్పల్: చిలుకానగర్‌లోని బస్తీ దవాఖానాను సాధారణ ప్రజలకు అందనంత ఎత్తులో అధికారులు ఏర్పాటు చేయడంతో పాటు కనీస వసతులు కల్పించకపోవడాన్ని నిరసిస్తూ ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు రాగిడి లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. చిలుకానగర్ చౌరస్తాలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ బస్తీ దవాఖానా అన్ని వయస్సుల వారికి అందుబాటులో ఉండే విధంగా సులభంగా వెళ్లేందుకు వీలుగా ఉండే స్థలాన్ని ఎంచుకోకుండా కొండపై ఉన్న కమ్యూనిటీ హాల్‌లో ఏర్పాటు చేస్తే వృద్ధులు ఎలా వెళ్తారని ప్రశ్నించారు. వెంటనే అధికారులు బోడ్రాయి వద్ద గల మహిళా భవన్‌లోకి మార్చాలని డిమాండ్ చేశారు. పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా మారినా పట్టించుకునే వారే కరువయ్యారని ఆరోపించారు. రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ అధ్వానంగా మారిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు మేకల శివారెడ్డి మాట్లాడుతూ నాటి వసతులే కనిపిస్తున్నాయి.. కానీ టీఆర్ఎస్ పాలనలో చేసిన అభివృద్ధి శూన్యమన్నారు. బస్తీదవాఖానాను మార్చకుంటే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో దాసరి కృష్ణ, బూర్గుల రమేష్‌గౌడ్, రాజ్యలక్ష్మీ, బొల్లం లక్ష్మణ్, పలకల నర్సింహారెడ్డి, వంజరి సంతోష్, సాయిబాబా, ఆశోక్‌రెడ్డి, బుచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



చిలుకానగర్‌లో నిరసన చేపడుతున్న కాంగ్రెస్ నాయకులు రాగిడి లక్ష్మారెడ్డి, మేకల శివారెడ్డి

జిల్లా ఆస్పత్రిలో సౌకర్యాలు పెంచుతాం

డీఎంహెచ్ఓ శ్రీనివాస్



క్లినిక్ ప్రారంభిస్తున్న డీఎంహెచ్ఓ శ్రీనివాస్

మల్కాజిగిరి: మల్కాజిగిరిలోని జిల్లా కేంద్ర ఆస్పత్రిలో సౌకర్యాలు పెంచుతామని డీఎంహెచ్ఓ డాక్టర్ పుట్ల శ్రీనివాస్ అన్నారు. వృద్ధుల ఆరోగ్య సంరక్షణ కోసం జాతీయ పథకం ద్వారా ఏర్పాటు చేసిన ఫిజియోథెరపీ క్లినిక్, మానసిక ఆరోగ్య క్లినిక్‌ను కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ప్రసాద్‌తో కలిసి ప్రారంభించారు. పుట్ల శ్రీనివాస్ మాట్లాడుతూ జిల్లా కేంద్ర ఆస్పత్రిలో రోగులకు ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. వృద్ధుల కోసం ఏర్పాటు చేసిన ఈ క్లినిక్‌లను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కీసర, మల్కాజిగిరి డివిజన్ ఉప వైద్యాధికారులు డాక్టర్ ఆనంద్, డాక్టర్ నారాయణ రావు, ఇతర డాక్టర్లు శాంతిమోహన్, డాక్టర్ సాయికిరణ్, సంగీత్, చంద్ర క్రిష్ణ, శేష పద్మ, జగదీష్‌గౌడ్, బాబు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం



పాలాభిషేకం చేస్తున్న సంచార జాతుల నేతలు

మేడిపల్లి: ఎంబీసీ కుటుంబాలకు రూ.లక్ష ఆర్థిక సహాయం అందజేస్తామని, సీఎం కేసీఆర్ ప్రకటించడంపై హర్షం వ్యక్తం చేస్తూ శుక్రవారం సంచార జాతుల రాష్ట్ర అధ్యక్షుడు చిందం పాండు వంశరాజ్ ఆధ్వర్యంలో చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుల సంఘాలను ప్రోత్సహించి వారిని ఆదుకున్న ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. సంచార జాతుల్లోని 36 కులాల తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. గురుకులాల్లో 5 శాతం రిజర్వేషన్, ఎంబీసీ కార్పొరేషన్ ఏర్పాటుతో విదేశాల్లో చదువుకునే విద్యార్థులకు రూ.20 లక్షల ఆర్థిక సాయం అందించడం గొప్ప విషయం అన్నారు. కార్యక్రమంలో అడ్వకేట్ గోపాల్, సురేష్, జిల్లెల నర్సింహ, శ్రవణ్, హన్మంత్, పాండు, వెంకటమ్మ, వెంకటేష్, ఆడపల్లి రాజాల వెంకటేషం, వివేక్ తదితరులున్నారు.

దూడను కాపాడబోయి.. కాపరి గల్లంతు

డీఆర్ఎఫ్, అగ్నిమాక సిబ్బందితో గాలించినా ఫలితం శూన్యం



శంకరయ్య(ఫైల్)



మలక్‌పేటలోని బావి వద్ద గాలిస్తున్న బలగాలు

శామీర్‌పేట్: దూడను కాపాడబోయి కాపరి గల్లంతయ్యాడు.. ఈ ఘటన శుక్రవారం మేడ్చల్ జిల్లా, లాల్‌గడి మలక్‌పేటలో వెలుగు చూసింది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. శామీర్‌పేట మండలం, లాల్‌గడి మలక్‌పేటకు చెందిన నీరుడి శంకరయ్య(56), గేదెల కాపరి. గురువారం గేదెలను కాసి, సాయంత్రం వాటిని ఇంటికి తిరిగి వస్తుండగా గ్రామపరిధిలోని ఓ బావిలో దూడ ప్రమాదవశాత్తు జారిపడింది. గమనించిన కాపరి శంకరయ్య దూడను కాపాడేందుకు బావిలోకి దిగాడని, పక్కనే ఉన్న గొర్రెల కాపరులు తెలిపారు. దూడ బావిలోంచి బయటకు వచ్చినా, కాపరి ఆచూకీ లభించలేదు. సమాచారం అందుకున్న శామీర్‌పేట పోలీసులు డీఆర్ఎఫ్, అగ్నిమాపక సిబ్బందితో గాలింపు చర్యలు చేపట్టారు. శుక్రవారం రాత్రి వరకు గాలించినా ఆచూకీ లభించలేదని ఎస్సై మునీందర్ తెలిపారు.

కాంట్రాక్టు అధ్యాపకులను క్రమబద్ధీకరించండి



అంబేద్కర్ విగ్రహం వద్ద కొవ్వొత్తులతో ప్రదర్శన నిర్వహిస్తున్న దృశ్యం

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్రంలోని 12 యూనివర్సిటీలలో పని చేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకుల ఉద్యోగాల రెగ్యులరైజ్ చేయాలని కోరుతూ కొవ్వొత్తుల ప్రదర్శన చేపట్టారు. శుక్రవారం వర్సిటీల కాంట్రాక్టు టీచర్ల జేఏసీ ఆధ్వర్యంలో ట్యాంక్ బండ్ అంబేద్కర్ విగ్రహం వద్ద కొవ్వొత్తులను ప్రదర్శిస్తూ మా బాధలను ఆలకించి... మా కుటుంబాలు, పిల్లల భవిష్యత్తును ఆలోచించి మా ఉద్యోగాలను రెగ్యులరైజ్ చేయాలని సీఎం కేసీఆర్‌ను వేడుకున్నారు. రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి ఎదురు చూడగా జూనియర్, డిగ్రీ, పాలిటెక్నికల్ కాలేజీల అధ్యాపకుల ఉద్యోగులను పర్మినెంట్ చేసి కేవలం వర్సిటీ ఉద్యోగులను మాత్రమే విస్మరించడం దారుణమన్నారు. వర్సిటీల కాంట్రాక్టు అధ్యాపకులను పర్మినెంట్ చేస్తే ప్రభుత్వానికి ఎలాంటి ఆర్థిక ఉండదన్నారు. కార్యక్రమంలో కాంట్రాక్టు టీచర్స్ జేఏసీ నాయకులు డాక్టర్ ధర్మతేజ, డాక్టర్ పరుశురామ్, డాక్టర్ రామేశ్వర్‌రావు, డాక్టర్ వేల్పుల కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బీటెక్ విద్యార్థుల గంజాయి దందా

కీసర: గంజాయి విక్రయిస్తున్న స్థావరంపై శుక్రవారం ఎస్ఓటీ ఎల్‌బీనగర్ జోన్ బృందం కీసర పోలీసులతో కలిసి దాడి చేశారు. దాదాపు 2 కిలోల గంజాయి, ఒక బైక్, నాలుగు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. కీసర సీఐ రఘువీర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం రాంపల్లిలోని బీరప్పదేవాలయం సమీపంలో గంజాయి విక్రయిస్తున్నట్లు పోలీసులకు అందిన పక్కా సమాచారంతో గంజాయి విక్రయ స్థావరంపై దాడిచేసి సుమారు రూ.లక్ష విలువచేసే గంజాయిని పట్టుకున్నారు. దుప్పనపూడి లోకేష్, సాయిశంకర్, రాసమల్ల మధుమోహన్, కోడాలి కిరణ్‌కుమార్‌ను ఎస్ఓటీ పోలీసులు అరెస్టు చేసి కీసర పోలీసులకు అప్పగించారు. కాగా గంజాయి సరఫరా చేసే ప్రధాన నిందితుడు మోహన్ అలియాస్ ప్రణీత్ పరారీలో ఉన్నాడని పోలీసులు తెలిపారు. నిందితులంతా బీటెక్ విద్యార్థులని చెప్పారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మహిళలకు స్వయం ఉపాధిలో శిక్షణ

మేడ్చల్: మహిళలు స్వయం ఉపాధి పొంది ఆర్థిక అభివృద్ధి సాధించేందుకు భారతీయ స్టేట్ గ్రామీణ స్వయం ఉపాధి సంస్థ ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లా చిల్కూరులో వివిధ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు ఎంపీడీఓ పద్మావతి తెలిపారు. టైలరింగ్, సెల్‌ఫోన్ రిపేరు చేయడం, మగ్గం వర్క్స్ వంటి కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల వారు మండల పరిషత్ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

లెదర్ ఉత్పత్తులపై శిక్షణ తరగతులు ప్రారంభం

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి కండ్లకోయలోని సీఎంఆర్ సీఎఫ్‌సీ ఆధ్వర్యంలో లెదర్ ఉత్పత్తులపై నిర్వహిస్తున్న రెండు వారాల శిక్షణ తరగతులు శుక్రవారం ప్రారంభమయ్యాయి. చిన్న మునగల గ్రామానికి చెందిన 80 మంది పాల్గొనగా వారికి లెదర్ వస్తువుల తయారీపై శిక్షణ ఇచ్చి శిక్షణ అనంతరం వారికి స్మాల్ స్కేల్ ఇండస్ట్రీస్ ద్వారా సహకారం అందజేయనున్నట్లు ప్రాజెక్టు పీఐ మోహన్‌రావు, కో పీఐ మనీష్, సీఎంఆర్ గ్రూప్స్ చైర్మన్ గోపాల్‌రెడ్డి, డైరెక్టర్ రాజిరెడ్డి, గ్రామ సర్పంచ్ స్వప్న, ఎంపీటీసీ అంబేడ్కర్ తదితరులు పాల్గొన్నారు.

పూడూర్ పురోహితుడికి నంది పురస్కారం



మేడ్చల్‌రూరల్: పూడూర్ గ్రామానికి చెందిన పురోహితుడు కలగ వెంకటేశ్‌శర్మకు నంది పురస్కారం దక్కింది. శ్రీ త్రినయన సాంస్కృతిక కళానిలయం ఆధ్వర్యంలో శుక్రవారం నగరంలోని త్యాగరాయ గానసభలో ఉగాది నంది పురస్కార మహోత్సవం నిర్వహించారు. రాష్ట్ర టూరిజం డెవలప్‌మెంట్ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా పూడూర్‌కు చెందిన వెంకటేశ్‌శర్మకు నంది పురస్కారాన్ని అందజేశారు. సాంస్కృతిక సేవా సంస్థ స్థాపక కార్యదర్శి శివకుమార్, శ్రవణ్‌కుమార్ పాల్గొన్నారు.

హామీలు తప్ప.. అమలు చేసింది లేదు..



మాట్లాడుతున్న ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి

ఘట్‌కేసర్: హామీలు తప్ప అమలు చేసింది లేదని, నెల రోజుల కావొస్తున్నా రైతులకు టోకెన్లు ఇవ్వలేదని, కొనుగోళ్లు నిలిచిపోవడంతో అకాల వర్షాలకు కుప్పలుగా ఉన్న ధాన్యం తడిసిపోతోందని, తక్షణమే కుప్పల్లోని ధాన్యం కొనుగోలు చేయాలని ఎంపీటీసీలు రవి, శోభారాణి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి అధ్యక్షతన శుక్రవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. రంగు మారిన ధాన్యం కూడా కొనుగోలు చేస్తామన్న సీఎం కేసీఆర్ హామీని అధికారులు బుట్టదాఖలు చేశారని విమర్శించారు. ధాన్యం కేంద్రాలు ప్రారంభించినా కొనుగోళ్లు ప్రారంభం కాకపోవడంతో 25 రోజులుగా రైతులు దినదినగండంగా గడుపుతున్నారన్నారు.

నిబంధనల మేరకు ధాన్యం కొనుగోళ్లు

ముఖ్యఅతిథి జెడ్పీ చైర్మన్ శరత్‌చంద్రారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల మేరకు రైతులకు ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోలు చేస్తామని అన్నారు. రైతుల సమస్యలు కలెక్టర్, డీసీఎంఎస్ అధికారులు సంయుక్తంగా పరిష్కరిస్తారని, అన్నదాతలు దిగులు పడొద్దన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అరుణ, తహసీల్దార్ విజయలక్ష్మీ, వైస్ ఎంపీపీ జంగమ్మ, జిల్లా గ్రంథాలయం చైర్మన్ దర్గా దయాకర్‌రెడ్డి, ఎఫ్ఎస్‌సీఎస్ చైర్మన్ రాంరెడ్డి, ఎంపీటీసీలు శోభారాణి, రవి, సరళ, సర్పంచులు వెంకటేశ్‌గౌడ్, వెంకట్‌రెడ్డి, యాదగిరి, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

నిబద్ధతకు నిదర్శనమే ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు

పోచారం: అన్నోజిగూడలోని శ్రీవిద్యా విహార్ హైస్కూల్ ఆవరణలో ఆర్ఎస్ఎస్ ప్రథమవర్ష శిక్షణ సార్వజనికోత్సవం శుక్రవారం సాయంత్రం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా శిక్షణ తీసుకొన్న వారిచే శారీరక ప్రదర్శనలు చేయించారు. అనంతరం ముఖ్య అతిథిగా పాల్గొన్న సెంట్రల్ ఎక్సైజ్, సేవా పన్నుల శాఖ మాజీ డిప్యూటీ కమిషనర్ కె.సాంబిరెడ్డి మాట్లాడుతూ.. నిబద్ధతకు నిదర్శనమే ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు అని ప్రశంసించారు. ముఖ్యవక్తగా రామ్‌భారత్ మాట్లాడుతూ.. అన్ని దేశాలతో సత్సంబంధాలను పెంచుకుంటూ మన దేశం అభివృద్ధి చెందాలని కోరుకుంటోందన్నారు. ఇతర దేశాలను అణగదొక్కి అభివృద్ధి చెందాలన్న ధోరణి మన దేశానికి లేదన్నారు. మత మార్పిడి చేసుకున్న వారికి రిజర్వేషన్లు వర్తించవని అంబేడ్కర్ చెప్పిన విషయాన్ని గుర్తుచేశారు. కార్యక్రమంలో వర్గ అతిథి చల్లా వివేకానందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైల్వేవంతెన పనులను వేగవంతం చేయాలి



చీఫ్ ఇంజినీర్‌కు వినతి అందజేస్తున్న చైర్ పర్సన్ పావనీయాదవ్, జంగయ్యయాదవ్

ఘట్‌కేసర్: ఘట్‌కేసర్‌లో నిర్మిస్తున్న రైల్వే వంతెన పనులను వేగవంతం చేయాలని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ చీఫ్ ఇంజినీర్ సతీష్ కుమార్‌కు మున్సిపల్ చైర్ పర్సన్ పావనీజంగయ్యయాదవ్ వినతి పత్రం అందజేశారు. ఏళ్లుగా వంతెన పనులు కొనసాగుతున్నాయని, జాప్యానికి కారణమైన కాంట్రాక్టర్ స్థానంలో నూతనంగా మరొకరికి అప్పగించాలని శుక్రవారం చీఫ్ ఇంజినీర్ కార్యాలయంలో ఆయనను కలిసి వినతి పత్రం అందజేశారు. రైల్వే వంతెన నిర్మాణంలో భూములు కోల్పోతున్న బాధితులకు పరిహారం చెల్లించే విషయమై జూన్ మొదటి వారంలో ఆర్డీఓ సమావేశం అవుతారని గుర్తు చేశారు. ఈ విషయమై ప్రజలు సహకరించాలని కోరారు.